ప్రతి మనిషీ
చివరి మజిలీని
కళ్లారా
చూడగలిగితే?

బి. శివకుమార్

కథ

# మలి సంధ్య

'రాఘవయ్యగారు చనిపోయారటండి... మామగారు' వాకిలిముందు కూరగాయలు కొనుక్కొని లోపలికి వస్తూ కృష్ణమూర్తి గారితో చెప్పింది ప్రమీల.

''ఏ రాఘవయ్యగారు, మన పక్క వీధిలో వుంటున్నాయనేనా?'' అంటూ అడిగారు కృష్ణమూర్తిగారు ఆదుర్దాగా.

''ఆ... ఆయనేనండి'' చెప్పింది ప్రమీల

''అయ్యో భగవంతుడా! ఆయన నిన్న సాయంత్రం సాయిబాబా మందిరంవద్ద కనిపించారమ్మా. బాగానే వున్నారు'' అన్నారు ఆయన.

''అదృష్టవంతులండి ఆయన. రాత్రి నిద్రపోయేవరకు బాగానే వున్నారట. నిద్దట్లోనే ఎప్పుడు పోయిందో... ఏమో... ప్రాణం. తెల్లవారి చూసేసరికి చనిపోయి వున్నారట. మన కూరలమ్మి చెప్పింది'' అంటూ తనకు తెలిసిన విషయాన్ని చెప్పింది ప్రమీల.

''ఒక్కసారి ఆయనను చూసి వద్దామమ్మా'' అన్నారు కృష్ణమూర్తిగారు. ఈ వార్త ఒక్కసారిగా ఆయనను విస్సత్తువ పరిచింది.

''అలాగే వెళ్ళిరండి'' అంది ప్రమీల.

''ఎందుకో ఇవ్వాళ ఒక్కడినే బయటకు వెళ్ళలేనేమో అనిపిస్తుంది. నువ్వుకూడా నాకు తోడురామ్మా అక్కడివరకు'' అని అడిగారు.

ప్రమీల కొంచెంసేపు ఆలోచించి... అలాగే లెండి మామగారు. నేను నా వంట పని ముగించుకుని ఒక గంటలో ఇట్టే



వచ్చేస్తాను. ఈ లోపు మీకు టీ ఇస్తాను, టీ తాగుతూ పేపర్ చదువుకుంటూ వుండండి. నేను నా పని ముగించుకుని వచ్చేస్తాను. ఇద్దరం కలిసి వెళదాం' చెప్పింది.

రాఘవయ్యగారి మరణం మానసికంగా చాలా క్రుంగదీసింది కృష్ణమూర్తిగారిని. ఒక్కసారిగా షాక్ తిన్నట్లుగా అయ్యింది ఆయన పరిస్థితి. అలా అని రాఘవయ్యగారితో ఆయనకు పెద్ద పరిచయం కూడా ఏమీ లేదు. పట్టుమని పదిహేను రోజులుకూడా

లేనిది వారి పరిచయం. అయినా అంతటి ఆత్మీయత ఏర్పడింది వారిద్దరిమధ్య.

కృష్ణమూర్తిగారు పేపరు చదువుతున్నా రన్న మాటేకాని, ఆయనకు ఏమీ వంటబట్ట డంలేదు. గడచిపోయిన తన జీవితం అంతా గుర్తుకురాసాగింది. భార్య మరణం... కొడు కువద్దకు రావడం... రాఘవయ్యగారితో పరిచయం... అంతా...

కృష్ణమూర్తిగారు రిటైర్ అయి పది సంవత్సరాలు దాటిపోయింది. రిటైర్‌మెంట్ రోజున ఆయన ఆఫీసు ఉద్యోగులు అందరూ ఆయనకు ఘనంగా సన్మానం చేశారు. తరువాత రెండు సంవత్సరాలకు ఆయన పిల్లలు ఆయనకు షష్టిపూర్తి కార్యక్రమం చేశారు. ఆయన జీవితంలో చాలా పండుగలకు ఆయనతోపాటు పాలుపంచుకున్న ఆయన శ్రీమతి ఆయనను విడిచి రెండు నెలల క్రితం చనిపోయింది.

నలభై అయిదు సంవత్సరాలకు పైబడి తనతోపాటు కష్టసుఖాలను పంచుకుని జీవించిన భాగస్వామి మరణం ఆయనకు చాలా బాధ కలిగించింది. తల్లి ఖర్మాంతరాలు అన్నీ పూర్తిచేసుకుని పిల్లలు ఎవరిదారిన వారు వెళ్ళడంతో ఆయన మరీ ఒంటరివారు అయ్యారు. పిల్లలు వాళ్ళతోపాటుగా ఆయనను రమ్మంటే బెట్టుచేశారు. కాని అడుగడుగునా భార్య జ్ఞాపకాల మధ్య గడపడం చాలా కష్టంగా వుంది. ఈ వాతావరణంనుంచి దూరంగా వెళితేగాని మరుపును అలవర్చుకోలేను అని అనుకున్నారు. కొడుకులతోపాటు వెళ్ళినా బాగుండేది అనుకున్నారు ఆయన.

పదిరోజుల తర్వాత, పెద్దకొడుకు శంకరం వచ్చాడు ఆయనవద్దకు. తండ్రి ఎలా వున్నారో చూసిపోదాం. వీలయితే తనతోపాటు తీసుకువెళ్ళాలని, ఆ ప్రయత్నంగానే తండ్రితో మాటలలోకి దిగాడు.

"ఇక్కడ ఒక్కడివే ఎందుకు నాన్నా. పిలిచినా పలికేవాళ్ళు లేరు. నీకు వేళకు అంత వండిపెట్టేవాళ్ళు లేరు. మాతోపాటు వచ్చేయకూడదు. మేము చేస్తున్న ఉద్యోగాలను వదులుకుని ఇక్కడకు రాలేమాయె" అన్నాడు బ్రతిమాలుగా.

"అలాగేలేరా! రేపు నీతోపాటు నన్ను కూడా తీసుకువెళుదువు. నాకు ఇక్కడ కష్టంగా వుంది ఒక్కడినే వుండాలంటే" అని తన అంగీకారాన్ని తెలిపారు కృష్ణమూర్తి గారు.

శంకరం తృప్తిగా నిద్రపోయారు. కృష్ణమూర్తిగారికి మాత్రం ఇన్ని సంవత్సరాలపాటు ఆ ఇంటితో పెంచుకున్న అనుబంధాన్ని తెంచుకుని వెళ్ళవలసి వస్తుందే అన్న బాధతో ఆ రాత్రి నిద్రపట్టలేదు.

తరువాతిరోజు శంకరం తన ఇంటికి తీసుకువచ్చేశాడు తండ్రి కృష్ణమూర్తిగారిని.


కృష్ణమూర్తిగారికి ఆ ఇంటిలో అంతా బాగానే వుంది. కోడలు ప్రమీల స్వంత కూతురులా ఉంటుంది... బాగా చూసుకుంటుంది. మనుమడు వినీల్ ఇంటిలో వున్నప్పుడు తాతగారితో సరదాగా గడుపుతాడు. అంతా బాగానే వుంటుంది. కాని ఆయనకు అక్కడకూడా ఒంటరితనం ఎదురయ్యేది ఎక్కువగా.

కొడుకు శంకరం రోజులో ఎక్కువ

భాగాన్ని ఆఫీసు పనులతోనే గడిపేస్తూ వుంటాడు. ఉదయం ఎప్పుడో వెళ్ళిపోతుంటాడు... రాత్రి ఎప్పటికో వస్తుంటాడు. వాడి ఉద్యోగమే అంత ఎప్పుడూ టూర్‌ల ఉద్యోగం. ఇక మనుమడు వినీల్, ఈ రోజులలో చిన్నపిల్లల సంగతి వేరే చెప్పనక్కరలేదు. మోయలేనన్ని పుస్తకాలు... ఎప్పుడూ చదువులే. ఉదయాన్నే లేవడం ప్రయివేటుకు వెళ్ళడం, మళ్ళీ రావడం హడావిడిగా తయారై టిఫిన్ క్యారేజ్ పుచ్చుకుని స్కూలుకు వెళ్ళడం, సాయంత్రం రావడం, మళ్ళీ ట్యూషన్‌కు వెళ్ళడం, రాత్రి ఆవులింతల మధ్య హోమ్‌వర్క్ పూర్తిచేసుకుని పడుకోవడం. మధ్యమధ్యలో 'హలో తాతగారు' అంటూ పలకరిస్తుంటాడు. ఈకాలపు పిల్లలకు ఒక ఆటలేదు.. పాటా లేదు. ఇక ఇంట్లో ఎప్పుడూ వుండేది కోడలు ప్రమీల ఆయన ఇద్దరే. ప్రమీల అప్పటికి వీలు కుదిరినప్పుడల్లా వచ్చి మాట్లాడి పోతూనే వుంటుంది. కాని ఎప్పుడూ ఆయన ప్రక్కనే వుండాలంటే కుదరదుకదా. చీటికి మాటికి పిలుస్తుంటే ఆవిడ విసుక్కుంటుందేమోనని ఆయన భయం. ఒక్క ఆదివారాలప్పుడు, పండుగ శలవులప్పుడు తప్ప మిగిలిన రోజులు అన్ని భారంగానే గడుస్తూ వుంటాయి ఆయనకు.

ఆ ఇంటికి వచ్చిన నాలుగురోజుల తరువాత ఆ వీధిలో ఉన్న సాయిబాబా మందిరంవద్ద రాఘవయ్యగారితో పరిచయం అయింది ఆయనకు.

ఆరోజు సాయంత్రం ఇంట్లో ఏమీ పాలుపోక అలా ఆ వీధిలోని మందిరం వద్దకు వచ్చారు ఆయన. గుడిలోపల నిలువెత్తున వున్న బాబా పటానికి నమస్కారం చేసి హారతి అందుకుని వచ్చి బయట అరుగుమీద కూచున్నారు. ముసలితనం కావడంవల్ల కాళ్ళు మడతకు రావు ఆయనకు. బాసాపట్టాలువేసుకుని కూర్చోలేరు. అందుకని ఆ అరుగు చివరగా కాళ్ళను కిందకు వేళ్ళాడేసుకుని కూచున్నారు. ఆ ప్రక్కనే ఒక



ముసలాయన కూచుని వున్నారు ఈయన్నే చూస్తూ.

''ఈ ఊరికి కొత్తగా వచ్చారా... లేక ఎవరి తాలూకు అయినా బంధువులా మీరు'' అని అడిగారు ఆ ముసలాయన కృష్ణమూర్తిగారిని.

''కొత్తగా వచ్చానండి. మా అబ్బాయి శంకరం చాలా కాలంనుండి ఇక్కడే వుంటున్నాడు. నేను ఈ మధ్యనే వాడివద్దకు వచ్చాను. ఇక ఇక్కడే కాలం వెళ్ళబుచ్చుతాను' అంటూ జవాబు ఇచ్చాడు కృష్ణమూర్తి.

''శంకరం నాకు బాగా తెలుసండి. నేను మీ పక్క వీధిలో వుంటుంటాను. 'నా పేరు రాఘవయ్య' అంటూ పరిచయం చేసుకున్నారు ఆ ముసలాయన. కృష్ణమూర్తిగారు కళ్ళజోడు సవరించుకుని దీక్షగా చూశారు ఆయనను. రాఘవయ్యగారికి ఎనభై సంవత్సరాలు పైబడే వుంటుంది వయసు. అయినా తనకంటే దృఢంగా వున్నారు ఆయన.

''ప్రతిరోజు సాయంత్రంపూట ఇలా వచ్చి ఒక గంటలేక గంటన్నర సేపు కాలక్షేపం చేస్తుంటాము. ఇంటివద్ద ఏమీ తోచక. అదీగాక రోజూ వాకింగ్‌లా కూడా వుంటుందికదా'' రాఘవయ్యగారు చెప్పారు.

మరికొంచెంసేపు కూర్చుని ఇద్దరూ బయలుదేరారు ఎవరి ఇళ్ళకువారు.

ఆరోజున అలా అయింది వాళ్లిద్దరి పరిచయం. ఆరోజునుంచి ప్రతిరోజు సాయంత్రం కోసం ఎదురు చూడడం అలవాటు అయింది ఆయనకు. ప్రతిరోజు సాయంత్రం మందిరం వరకూ నడిచివెళ్ళి అక్కడ అరుగులమీద కూచుని రాఘవయ్యగారితో మాట్లాడుతూ కొంత సమయాన్ని గడపడం తర్వాత ఇద్దరూ కలసి మాట్లాడుకుంటూ చిన్నగా నడుస్తూ ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళడం. ఇది ఆయన దినచర్యలో ఒక భాగంగా మారింది.

రాఘవయ్యగారితో పరిచయం అయి పట్టుమని పదిహేను రోజులుకూడా కాలేదు. అప్పుడే ఇలా అయ్యింది.

వీళ్ళిద్దరి మాటలలో చాలా విషయాలు చోటుచేసుకునేవి. ఈనాటి కుర్రవాళ్ళు ఎలా ఉంటున్నారు అన్న విషయం దగ్గరినుంచి, దేశ రాజకీయాలలో వస్తున్న మార్పులవరకూ ప్రతి విషయాన్ని చర్చించేవాళ్ళు. ప్రతిరోజు... ఆనాటి దినపత్రికలలోని వార్తలను గురించి మాట్లాడుకునేవాళ్ళు. అప్పుడప్పుడు కొన్ని... కొన్ని ఛలోక్తులు కూడా దొర్లుతుండేవి వారి మాటలలో.

వారి చర్చా వేదిక అయిన ఆ గుడి... పేరుకుమాత్రమే గుడి. కాని అక్కడ జరగవలసిన అక్రమాలు అన్నీ జరుగుతుంటాయి. చాలామంది అమ్మాయిలు ప్రతిరోజూ సాయంత్రమప్పుడు చక్కగా సింగారించుకుని అక్కడికి వస్తుంటారు. వారికోసమని అబ్బాయిలు వస్తుండేవారు. ఈ ప్రేమపక్షులకు ఇంటివద్ద కలుసుకునేందుకు వీలుపడదు కాబట్టి స్వామివారు తన సన్నిధిలో వాళ్ళకు ఆ భాగ్యాన్ని కలిగిస్తూ వుంటారు.

దానిని గురించికూడా అప్పుడప్పుడు

మాట్లాడుతుంటారు రాఘవయ్యగారు. ఈ కాలపు కుర్రవాళ్ళు మరీ విడ్డూరంగా తయారవుతున్నారండి. ఆడపిల్ల నవ్వితే చాలు చొంగ కార్చుకుంటూ దాని వెంట పట్టుకు తిరుగుతూ ఇల్లు, వళ్ళు గుల్ల చేసుకుంటున్నారు అనేవాళ్ళు. ఆయన యవ్వనంలో ఏమేం చిలిపిపనులు ఎలా చేశారో చెప్పేవారు. అంతా చెప్పి మనం ఏం చేసినా వీళ్ళలా చెయ్యలేదండి. అంతా పకడ్బందీగానే జరిపాం అని ఆ విషయాన్ని అలా ముగించేవారు.

కొంచెంసేపు ఈనాటి సినిమాల గురించీ మాట్లాడేవారు. ఈ రోజుల్లో సినిమాల పేర్లే ఏమీ బాగోటం లేదు. మరి ఇక ఆ సినిమాలలో కథ... కమామిషు ఏమైనా ఏడ్చి ఛస్తుందంటారా? అని అడిగేవారు. ''సుబ్బారావుకు కోపం వచ్చింది.' 'గుండమ్మగారి కృష్ణులు' 'మీసంకోసం' ఏవిటండి ఈ సినిమాల పేర్లు. పైగా ప్రతివారం ఈ టీవీలలో వేసే సినిమాలు అస్సలు చూడలేక పోతున్నాం. మా అబ్బాయి ఆ మధ్య ఎప్పుడో 'వీరబ్రహ్మంగారి చరిత్ర' చూపించాడు. అదే నేను ఈ నాటి సినిమాలలో చూసింది అనేవారు.

ఒక్కొక్కసారి రాజకీయాలలోకి వెళ్ళిపోయి అనర్గళంగా మాట్లాడేవారు. రాజీవ్‌గాంధీ తిరిగి అధికారంలోకి రాగలరా? వి.పి.సింగ్ ఎంతకాలం పాలించగలడు. రామారావు ఎందుకు ఓడిపోయాడు. ఈ విషయాలు అన్నీ మాట్లాడేవారు. ఒక్కటేమిటి ఏ టాపిక్ తీసుకున్నా దానిని గురించి బాగా మాట్లాడేవారు ఆయన.

ఒక్కమాటలో చెప్పాలంటే రాఘవయ్యగారు ఒక గ్రంథం, ఆయన జీవితం ఈనాటి యువకులకు ఆదర్శనీయం. ఆయన జీవితానికి సంబంధించిన విషయాలకు వస్తే... ఆయనకు పదిమంది సంతానం. ఆరుగురు మగపిల్లలు, నలుగురు ఆడపిల్లలు. ఆయనది బడి పంతులు ఉద్యోగం. ఆ ఉద్యోగంతోనే ఆయన అంతమందిని చదివించి పెంచి పెద్దచేసి వాళ్ళ పెళ్ళిళ్ళు చేశారు. ఆయన పెద్ద పిల్లలు కాస్త పెద్ద అవగానే ఆయనకు కాస్త సహాయం అందించారు. ఆ సహాయంతోనే ఆయన మిగిలిన వారినికూడా పెంచి పెద్ద చేశారు. ఆయన ఉద్యోగంనుంచి రిటైర్ అయినాకకూడా, ఒక ట్యుటోరియల్ కాలేజీలో పాఠాలు చెబుతూనే గడిపేవారు. అలా ఆయన భార్య



## పరుగు

''అలా పరుగెత్తకూడదమ్మా! పడ్తే కాలు విరుగుతుంది!' ' పార్కులో పరుగెత్తున్న భావనని ఆపి చెప్పాడు రేవంత్.

''ఫర్వాలేదు అంకుల్! మా నాన్న డాక్టరే!'' కళ్ళు తిప్పుతూ బదులిచ్చింది భావన.

—జోకర్ (హైదరాబాద్)

చనిపోయేంతవరకు సంపాదిస్తూ తనకాళ్ళమీద తాను నిలబడ్డారు ఎవరిమీదా ఆధారపడకుండా. ఆయన భార్య చనిపోయి ఎనిమిది సంవత్సరాలు దాటిపోయింది. ఆయనకు వచ్చే పెన్షన్ డబ్బులు ఆయన ఒక్కడికి సరిపోతాయి కాబట్టి ఉద్యోగం మానేశారు.

'మామగారూ నేను రడీ, ఇక వెళ్ళి వద్దామా' అన్న ప్రమీల పిలుపుకు... తన ఆలోచనల నుంచి బయటపడ్డారు కృష్ణమూర్తిగారు.

'ఆ అలాగేనమ్మా! ఇదిగో వచ్చేస్తున్నా' అంటూ చేతి కర్ర తీసుకుని బయలుదేరారు

కృష్ణమూర్తిగారు, ప్రమీల రాఘవయ్యగారి ఇంటికి వచ్చేటప్పటికి అక్కడ వచ్చేపోయే జనాలతో కోలాహలంగా ఉంది.

రాఘవయ్యగారు ప్రశాంతంగా నిద్రపోతున్నట్లుగానే ఉన్నారు. ఆయన శవం చుట్టూ బంధువులు మౌనంగా కూచుని వున్నారు. దూరంగా పిల్లలు ఆడుకుంటున్నారు... ఆయన ముని మనుమళ్ళు వారు. మరో పక్కన కొంతమంది కుర్రాళ్ళు,

మధ్య వయస్కులు కూచుని ఏవేవో వ్యవహారాలు చెప్పుకుంటున్నారు. మధ్య... మధ్యలో నవ్వుకుంటూ అక్కడివాళ్ళు ఎవ్వరూ ఆయన మరణానికి అంతగా బాధపడుతున్నట్లుగా లేరు. మధ్య... మధ్యలో ఏదో శోకాలు పలికిస్తున్నారు. అంతే. దీనికి కారణాలు ఒకటి ఆయనది వృద్ధాప్యపు మరణం కావటం... రెండవది ఆయన మంచాన పడకుండా పోవటం. ఈ రెండు అక్కడి వాళ్ళకు కొంత ఊరటకలిగించాయి.

రాఘవయ్యగారి పెద్దకొడుకు కృష్ణమూర్తిగారికంటే ఓ పది సంవత్సరాలు చిన్న అయి వుంటారు. ఆయన వచ్చి కృష్ణమూర్తి గారిని పలుకరించారు. రండి... కూర్చోండి. అంటూ చెయ్యి పట్టుకుని వెళ్ళి కుర్చీలో కూర్చోబెట్టి ఆయన ఓ కుర్చీలో కూర్చున్నారు.

'రాత్రి మాతోపాటు భోజనం చేసి మా వసారాలో కొంచెంసేపు అటూ... ఇటూ తిరిగి, మా అందరితో ఏవేవో కబుర్లు చెప్పి పడుకున్నారు. అవే ఆఖరి మాటలు. ఏ రాత్రివేళ ప్రాణం పోయిందో ఏమో తెల్లవారాక చూసుకున్నాము. రాత్రంతా నేను ఆయన గదిలోనే పడుకున్నాను. ఏమీ బాధపడ్డట్లుకూడా లేరు' చెప్పారు ఆయన.

'రాఘవయ్యగారు చాలా అదృష్టవంతులండి. ఇలాంటి చావు ఎన్ని పుణ్యాలు చేసుకుంటేనో కాని రాదు' అన్నారు కృష్ణమూర్తిగారు.

'పైగా ఇవ్వాల్టినుంచే సంక్రాంతి పండుగ నెల మొదలు అయ్యింది. ఇటువంటి రోజులలో పోవటం అన్నది ఎంతో పుణ్యఫలం'

అక్కడ కూచున్న ఆడవాళ్ళలో ఒకావిడ అంది.

రాఘవయ్యగారిని చూస్తుంటే 'నీదంటూ ఏమీ లేక సెలవంటూ ఈ లోకాన్ని వదిలి వెళ్ళిపోయావా ఓ నేస్తం' అన్న మహాకవి వాక్యాలే గుర్తుకురాసాగాయి కృష్ణమూర్తిగారికి. కొంచెంసేపు అక్కడ కూర్చుని ఇంటికి వచ్చి చేరారు కృష్ణమూర్తిగారు, ప్రమీల.

కృష్ణమూర్తిగారికి ఆరోజు రాత్రి అంతా అసలు నిద్రపట్టలేదు. ఎంతగానో బాధపడ్డారు. రాఘవయ్యగారి మరణానికి బహుశా రాఘవయ్యగారి పిల్లలు కూడా అంత బాధపడివుండరు. రాఘవయ్యగారు తెల్లటి పంచకట్టుకుని, లాల్చీ వేసుకొని పైపంచెను మెడ చుట్టూ తిప్పి ఎడమ భుజంపై వేసి, నడిమ పాపిట తీసి తలదువ్వి చేతి కర్ర తీసుకుని ఆ వీధులలో తిరుగుతున్నట్లుగానే కళ్ళలో కదలాడసాగింది.

రోజులు భారంగా... ఒంటరిగా గడిచిపోసాగాయి కృష్ణమూర్తిగారికి. ఒకరోజు రాఘవయ్యగారి పెద్దబ్బాయి కృష్ణమూర్తిగారింటికి వచ్చారు.

'అప్పుడే పదమూడు రోజులు కావస్తున్నాయి రాఘవయ్యగారు పోయి' అన్నారు కృష్ణమూర్తి.

'అవునండి. రేపు నాన్నగారి పెద్ద ఖర్మ. ఆ విషయం మాట్లాడుదామనే వచ్చాను. పనిలో పనిగా రేపు అందరం కలుసుకుంటున్నాం కాబట్టి ఉన్న ఆ ఒక్క ఇంటి పంపకాలు కూడా చూసుకోవాలనుకుంటున్నాం. పెద్దవారు, మీరు వచ్చి రేపు ఆ విషయం చూడవలసిందిగా అడుగుదామని వచ్చాను' అని అసలు విషయం చెప్పారు.

'అలాగేలే' అన్నారు కృష్ణమూర్తిగారు.

కొంచెంసేపు ఆ విషయాలు... ఈ విషయాలు మాట్లాడుకున్నాక ఆయన వెళ్ళిపోయారు.

కృష్ణమూర్తిగారికి నవ్వు, బాధ రెండూ కలిగాయి. రాఘవయ్యగారు భవబంధాలనుంచి ఇంకా పూర్తిగా విముక్తుడు కాకముందే... ఆయన పిండం పెట్టకముందే... ఆయన పిల్లలు ఇలా ఉన్న ఆ ఒక్క ఆస్తి భాగాల గురించి ఆలోచిస్తున్నారు. అందుకు నవ్వాలో ఏడ్వాలో తెలియలేదు.

చివరకు కళ్ళు మూసుకుని ఒకటే మాట అనుకున్నారు మనసులో. 'రాఘవయ్యగారు మీ జీవితంలా నేను నా జీవితాన్ని గడపలేకపోయినా, మీ చావులాంటి చావును నాకు ప్రసాదించమని, మీ చావు తరువాత పరిస్థితులలాంటి పరిస్థితులను నాకు రాకుండా చూడమని నా తరఫున భగవంతుడికి నివేదించండి మీరు' అని.

*



## చిట్కా వైద్యం

మీరు జలుబు, గొంతు నొప్పితో బాధపడుతున్నారా? అయితే ఈ చిట్కా వైద్యాన్ని ప్రయత్నించి చూడండి. ఓ తమలపాకులో మూడు మిరియాలు, కొద్దిగా ఉప్పు, పసుపు వేసి బుగ్గన పెట్టుకోండి. మంచి ఫలితం కన్పిస్తుంది! ముఖ్యంగా ఇలాంటి దీర్ఘ వ్యాధి ఉన్నవారు వెంటనే ప్రయత్నిస్తే మంచిది!

—జూపిటర్